క్లుప్తంగా

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

ఆత్మకూరురూరల్: ఈ నెల 24న కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆత్మకూరు ఆర్టీసీ డిపో నుంచి అరుణాచలానికి వెళ్లేందుకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీస్ ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజరు కరీమున్నీసా, డిపో అసిస్టెంట్ మేనేజరు కల్పన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 23వ తేదీ ఉదయం 8 గంటలకు ఆత్మకూరు ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక సూపర్‌లగ్జరీ బస్సు బయలుదేరుతుందన్నారు. రానూపోనూ టికెట్ ధర రూ.1400 నిర్ణయించామన్నారు. మార్గమధ్యంలో కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, అరుణాచలం గిరి ప్రదక్షిణ, దర్శనం ఆర్టీసీ సంస్థ ఏర్పాటు చేస్తుందన్నారు. ఇతర వివరాలకు డిపో మేనేజరు 99592 25645, డిపో అసిస్టెంట్ మేనేజరు 99660 09395, బస్సు కండక్టర్ 85559 29504 నంబర్లలో సంప్రదించవచ్చునని తెలిపారు.

అధికారులు చొరవ చూపాలి

దుత్తలూరు: సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని ఎంపీపీ చేజర్ల జయంత్ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా విద్యుత్ సమస్య ఉందని, దానిని వెంటనే పరిష్కరించాలన్నారు. చాలా చోట్ల స్తంభాలు శిథిలావస్థలో ఉన్నాయని, వాటిని మార్చాలని కోరారు. ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తెచ్చిన సమస్యలన్నీ త్వరితగతిన పరిష్కరించాలన్నారు. రానున్న వేసవి దృష్ట్యా మంచినీటి సమస్య లేకుండా ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కమ్మవారిపాళెం సొసైటీ అధ్యక్షుడు తుమ్మల వెంగయ్యచౌదరి, ఎంపీడీఓ సాయిప్రసాద్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



రాగమ్మ కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న సర్పంచ్ మహాలక్ష్మమ్మ

కలిగిరి: మండలంలోని కృష్ణారెడ్డిపాళెం పంచాయతీ కుడుములదిన్నెపాడులో తన్నీరు రాగమ్మ ఉత్తరక్రియల నిమిత్తం సర్పంచ్ నలతాటి మహాలక్ష్మమ్మ బుధవారం రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. తన్నీరు రాగమ్మ భర్త మల్లికార్జున, కుటుంబ సభ్యులను సర్పంచ్ మహాలక్ష్మమ్మ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు నలతాటి యాదగిరి, తన్నీరు కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

హ్యూమన్ రైట్స్ కమిటీ ఏర్పాటు



ఆత్మకూరు: ఆత్మకూరు డివిజన్ స్థాయి హ్యూమన్ రైట్స్ కమిటీని ఎంపిక చేసినట్లు గరుడవేగా ఆఫ్ ది సొసైటీ జాతీయ కార్యదర్శి ఎస్ ఆంజనేయకుమార్ తెలిపారు. ఈ సంస్థ కేంద్ర న్యాయశాఖ అధీనంలో సేవా దృక్పథంతో పని చేస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని పలు డివిజన్లలో హ్యూమన్ రైట్స్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని, ఆత్మకూరు డివిజన్ స్థాయి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వివరించారు. ఆత్మకూరుకు చెందిన కందుల స్టీఫెన్ అధ్యక్షుడిగా, ఎ వెంకట్ ఉపాధ్యక్షుడిగా, పొదిలి పుల్లయ్య కార్యదర్శిగా, మాదాల కోటేశ్వరయ్య ఉప కార్యదర్శిగా, కె మల్లికార్జున ట్రెజరర్‌గా, ఎ రాజేష్, ఇమ్మానుయేల్, వి వజ్రమ్మ, కోలా ఆనందరావు లీగల్ మెంబర్లుగా, నరసింహులు లీగల్ అడ్వైజరుగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. దళితులకు జరుగుతున్న అన్యాయాలను వెలుగులోకి తెచ్చి కేంద్ర మానవ హక్కుల సంఘానికి తెలియజేసి వారికి న్యాయం జరిగేంత వరకు హ్యూమన్ రైట్స్ కమిటీ కృషి చేస్తుందని నూతన అధ్యక్షుడు స్టీఫెన్ తెలిపారు.

మాతృభాషను గౌరవించండి



విద్యార్థులను అభినందిస్తున్న సేవా సమితి

ఆత్మకూరు: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆత్మకూరుకు చెందిన తెలుగుభారతి సేవా సమితి బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులకు మాతృభాషపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు తెలుగుభారతి సేవా సమితి బహుమతులు అందజేసింది. పలువురు వక్తలు మాట్లాడుతూ మాతృభాష గొప్పతనాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని, మాతృభాషను గౌరవించాలని కోరారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు సోమవరపు సుబ్బరాయుడు, కార్యదర్శి వెంకటరెడ్డి, సభ్యులు ఎస్‌వీ రమణయ్య, వి.నారాయణరావు, యానాదిరెడ్డి, టీసీవీ సుబ్బయ్య, ఎస్.రామ్మోహన్‌రెడ్డి, గోవిందరెడ్డి, కేవీ శేషారెడ్డి, ఈ రత్నమ్మ, జి సురేష్ బాబు, అపస్మా, ఉపాధ్యాయ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ ఖాయం

- సంక్షేమ పథకాలతో పేదలకు భరోసా
- నాలుగున్నరేళ్లలో 95 శాతం పేదలకు లబ్ధి
- అత్యధిక మెజార్టీతో ప్రతాప్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలి
- రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి పక్కన ఎంపీ బీద మస్తాన్‌రావు

బిట్రగుంట: రాష్ట్రంలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ క్లీన్‌స్వీప్ చేసి చరిత్ర సృష్టించడం ఖాయమని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు అన్నారు. బోగోలు పంచాయతీ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్‌సీపీ మండల స్థాయి కార్యకర్తల ఆత్మీయ సమావేశాన్ని బుధవారం ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నిర్వహించారు. ఎంపీ బీద మస్తాన్‌రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించుకునేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని తెలిపారు. గడిచిన నాలుగున్నరేళ్ల కాలంలో 95 శాతం పేద కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం అండగా నిలబడిందన్నారు. సంక్షేమ పథకాల అమల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే ఆదర్శంగా నిలిచారని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందించాలనే లక్ష్యంతో సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. వలంటీర్ల వ్యవస్థ కరోనా సమయంలో అందించిన సేవలు ప్రజలకు చిరస్థాయిగా గుర్తుండిపోతాయన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటి వద్దకే వచ్చి పింఛన్లు అందించడంతో పాటు అర్హులను గుర్తించి పథకాలు అందించడంలో వలంటీర్లు కీలకంగా మారారని తెలిపారు. వలంటీర్లు, సచివాలయాల ద్వారా పార్టీలు, కులమతాలకు అతీతంగా ప్రభుత్వం పేదలకు అండగా నిలబడిందని తెలిపారు. 95 శాతానికి పైచిలుకు పేదలకు న్యాయం చేశామనే నమ్మకంతోనే సీఎం జగన్‌మోహన్ రెడ్డి ధైర్యంగా 175కి 175 స్థానాలు సాధించగలమనే భరోసా వ్యక్తం చేశారని వివరించారు. రానున్న ఎన్నికల్లో కావలి నుంచి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

టీడీపీని తరిమికొట్టేందుకు సిద్ధం కావాలి

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

పెత్తందారీ విధానాలతో పేదల జీవితాలు ఛిద్రం చేసిన టీడీపీని రాష్ట్రం నుంచి పూర్తిగా తరిమికొట్టేందుకు ప్రజలంతా 'సిద్ధం' కావాలని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి తెలిపారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు చేసిన అరాచకాలు, ఆనాటి పేదలపై ప్రభుత్వం అవలంబించిన నిరంకుశ విధానాలను ప్రజలు ఇంకా మర్చిపోలేదని తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే పేదల జీవితాల్లో వెలుగులు వచ్చాయన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత సంక్షేమ పథకాల ద్వారా రైతులకు, మహిళలకు, పేదలకు, యువతకు అండగా నిలిచారని వివరించారు. వలంటీర్లు, సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, తదితర కార్యక్రమాలతో నేరుగా గ్రామాల చెంతకే పాలన తీసుకువెళ్లిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో వైఎస్సార్‌సీపీని గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు.

భారీ బైక్ ర్యాలీతో ఘన స్వాగతం

బోగోలు పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశానికి అన్ని గ్రామాల నుంచి కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలి వచ్చారు. సమావేశానికి ముందు కప్పరాళ్లతిప్ప నుంచి భారీ బైక్ ర్యాలీతో ఎమ్మెల్యేకి ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి కూడా బైక్ ర్యాలీలో పాల్గొని కార్యకర్తలను ఉత్తేజ పరిచారు. జై జగన్, జై వైఎస్సార్ సీపీ నినాదాలతో కప్పరాళ్లతిప్ప కూడలి నుంచి బోగోలు పంచాయతీ కార్యాలయం వరకు నిర్వహించిన బైక్ ర్యాలీ హోరెత్తించింది. కార్యక్రమంలో రాష్ట్ర ఆప్కాఫ్ చైర్మన్ కొండూరు అనిల్ బాబు, కావలి ఏఎంసీ మాజీ చైర్మన్ దేవరాల సుబ్రహ్మణ్యం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మద్దిబోయిన వీరరఘు, నాగులవరం పీఏసీఎస్ అధ్యక్షుడు సుంకే మాల్యాద్రి, ఎంపీపీ మేకల సుజాత, జెడ్పీటీసీ మద్దిబోయిన కీర్తన, మండల యువత అధ్యక్షుడు మేకల శ్రీనివాసులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా 'పది' పరీక్షలు



శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న డీఈఓ రామారావు

- డీఈఓ పీవీజే రామారావు
- హెచ్‌ఎంలకు శిక్షణా తరగతులు

ఆత్మకూరు: త్వరలో జరగనున్న పదో తరగతి పరీక్షలను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఇన్విజిలేటర్లు, డీఓలు బాధ్యతగా వ్యవహరించి పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు అన్నారు. మార్చి నెలలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహించేలా ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించడంతో డివిజన్ పరిధిలోని పాఠశాలల హెచ్‌ఎంలు, ఎంఈఓలకు ఒక రోజు శిక్షణా తరగతులు (ఓరియేంటేషన్) బుధవారం నిర్వహించారు. డీఈఓ రామారావు మాట్లాడుతూ డివిజన్ చీఫ్ సూపరింటెండెంట్‌లు, ఎంఈఓలు, హెచ్‌ఎంలు సమైక్యంగా ప్రణాళిక మేరకు పదో తరగతి పరీక్షలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పరీక్షలు నిర్వహించాలన్నారు. డీసీఈబీ కార్యదర్శి రామ్ కుమార్ పరీక్షల నిర్వహణ, ప్రశ్నపత్రాల భద్రత, పరీక్షల అనంతరం జవాబు పత్రాలను కేంద్రాలకు చేర్చడం, తదితర అంశాలపై కూలంకషంగా హెచ్‌ఎంలకు వివరించారు. ఎలాంటి సందేహాలు ఉన్నా ఉన్నతాధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు నజీర్ బాషా, జ్యోతి, ఎస్ఎస్ఏ ఉద్యోగి భాస్కర్ రెడ్డి, పలు పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

పొగాకు అపహరణపై రైతుల ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న పొగాకు రైతులు

దుత్తలూరు: తాము సాగు చేస్తున్న పొగాకు తోటల్లో అర్ధరాత్రి వేళ గుర్తుతెలియని వ్యక్తులు పొగాకును దొంగిలిస్తున్నారని బుధవారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మండలంలోని కమ్మవారిపాళెం, లక్ష్మీపురం, ముత్తరాశిపల్లి, రాఘవరెడ్డిపల్లి గ్రామాలకు చెందిన రైతులు మాట్లాడుతూ తాము ఆరుగాలం పండించి పెంచుకున్న పొగాకు తోటలను ఇతర ప్రాంతాలకు చెందిన కొందరు అర్ధరాత్రి దాటిన తర్వాత ఎండు, పచ్చి ఆకులను రెల్చుకుని పోతున్నారన్నారు. అధికారులు స్పందించి వారిపై నిఘా పెట్టి పొగాకు దొంగతనానికి పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని ఫిర్యాదు చేశారు.

గౌతమ్‌రెడ్డి సేవలు నిరుపమానం

- ఘన నివాళులర్పించిన నేతలు



ఆత్మకూరు: మున్సిపల్ బస్టాండ్ ఆవరణలో గౌతమ్‌రెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఆత్మకూరు: ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఐదేళ్లు, అధికార పక్షంలో మంత్రిగా రెండున్నరేళ్లలోనే దివంగత పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి ఆత్మకూరు నియోజకవర్గానికి చేసిన సేవలు నిరుపమానమని పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు గుర్తు చేసుకున్నారు. బుధవారం ఆయన రెండో వర్ధంతిని పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పట్టణంలోని మున్సిపల్ బస్టాండ్ ఆవరణలోని మేకపాటి గౌతమ్‌రెడ్డి విగ్రహానికి పట్టణ, పార్టీ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకట రమణమ్మ, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య ఆధ్వర్యంలో వర్ధంతిని నిర్వహించారు. ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేగా సొంత నిధులతో చేసిన పలు ప్రజోపయోగ పనులను వివరించారు. మంత్రిగా ఆత్మకూరు అభివృద్ధి కోసం ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు, చెరువు కట్ట అభివృద్ధి పనులకు ప్రణాళికలు, రైతులకు సజావుగా సాగునీరు అందించేందుకు తన సొంత నిధులతో జేసీబీ యంత్రాలను ఏర్పాటు చేసిన అంశాలను వివరించారు. నెల్లూరుపాళెం సెంటర్‌లోని మేకపాటి గౌతమ్‌రెడ్డి విగ్రహానికి స్థానిక కౌన్సిలర్ కామాక్షయ్య నాయుడు నేతృత్వంలో పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కరోనా కష్ట కాలంలో ఆయన ప్రజలకు అందించిన ఆరోగ్య, ఆహార సరఫరా సేవలను కొనియాడారు. వైస్ చైర్మన్ షేక్ సర్దార్, కౌన్సిలర్లు పి పెంచలయ్య, మహబూబ్‌బాషా, గంధళ్ల వేణు, పార్టీ నాయకులు కొండా వెంకటేశ్వర్లు, నలిశెట్టి శీనయ్య, చిల్లూరు వెంకటేశ్వర్లు, రహీం, కలాం, నోటి వినయ్‌కుమార్ రెడ్డి, జి మునిరెడ్డి, నలిశెట్టి శీనయ్య, కేతా రవి, తోడేటి మణి, జమీర్ బాషా, చెన్నకేశవులు, సాధిక్ హుస్సేన్ పాల్గొన్నారు.

గౌతమ్‌రెడ్డికి ఘన నివాళి

సంగం: దివంగత మేకపాటి గౌతమ్‌రెడ్డి ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకుని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం బ్యారేజ్ వద్దనున్న మేకపాటి గౌతమ్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు పులగం శంకర్ రెడ్డి, మాజీ మండల కన్వీనర్ కంటాబత్తిన రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ గౌతమ్‌రెడ్డి మంత్రిగా యువతకు ఎన్నో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారని, మరెన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టే తరుణంలో హఠాన్మరణంతో మా అందరికి దూరమయ్యారని గుర్తు చేసుకున్నారు. గౌతమ్‌రెడ్డి ఆశయ సాధన కోసం ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సారథ్యంలో ముందుకు నడుచుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి, శివాలయం చైర్మన్ రవీంద్రబాబు, వైఎస్సార్‌సీపీ బీసీ నేత రావుల ప్రసాద్‌గౌడ్, గృహసారథుల మండల కన్వీనర్ మల్లికార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేజర్లలో..

చేజర్ల: దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి రెండో వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బుధవారం చేజర్ల ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన వర్ధంతి కార్యక్రమంలో గౌతమ్‌రెడ్డి ఆత్మకూరు నియోజకవర్గానికి, రాష్ట్రానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

తరలివెళ్లిన అభిమానగణం

ఆత్మకూరురూరల్: దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఉదయగిరిలో నిర్వహించిన కార్యక్రమాలకు ఆత్మకూరు మండలం నుంచి పెద్ద ఎత్తున ఆయన అభిమానులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, నాయకులు బుధవారం తరలివెళ్లారు. మండలంలోని ప్రతి గ్రామంలో ఆయన చిత్రపటాలకు ఎక్కడికక్కడే పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మండలంలోని మురగళ్ల ఎస్సీ కాలనీలో వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీ మేనేజరు తోడేటి అశోక్ ఆధ్వర్యంలో స్థానిక నాయకులు, గౌతమ్‌రెడ్డి అభిమానులు ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చిట్టమూరు జితేంద్రనాగ్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ వల్లభనేని రాజేంద్ర ఆధ్వర్యంలో ఉదయగిరికి తరలివెళ్లారు.



గౌతమ్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఆత్మకూరు: నెల్లూరుపాళెం సెంటర్‌లో గౌతమ్‌రెడ్డి విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న కౌన్సిలర్లు



చేజర్ల: గౌతమ్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

గెలుస్తాం.. మెజార్టీ చూపిస్తాం



సిద్ధం అంటూ నినాదాలు చేస్తున్న ఎంపీ బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి తదితరులు

- సమష్టిగా పనిచేసి.. విజయం సాధిద్దాం
- అభ్యర్థులను కూడా పెట్టుకోలేని దుస్థితిలో టీడీపీ
- రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు

అల్లూరు: రాబోయే ఎన్నికల్లో కావలి నియోజకవర్గంలో గెలుపు ఖాయమని, ఈ దఫా మెజార్టీ అంచనాలకు అందని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు సవాల్ చేశారు. పచ్చమీడియా.. ప్రతిపక్ష పార్టీలు, తోక పార్టీలు ఎన్ని కలిసి వచ్చినా.. డిపాజిట్లు కూడా దక్కకుండా చేస్తామన్నారు. ఇప్పటి వరకు ఒక్క నా సొంత పంచాయతీ ఇస్కపల్లిలో 2 వేల మెజార్టీ చూపిస్తానని చెప్పాను. కొందరు నా ఇగోను టచ్ చేశారు. ఇప్పుడు చెబుతున్నాను.. 3 వేల మెజార్టీ తగ్గనివ్వనని మస్తాన్‌రావు ధీమా వ్యక్తం చేశారు. అభ్యర్థులను కూడా పెట్టుకోలేని పార్టీల పేరు చెప్పుకునే గ్రామ స్థాయికి సరిపోని వ్యక్తులు మాట్లాడుతుంటే హాస్యాస్పదంగా ఉందన్నారు. కావలి నియోజకవర్గంలో ట్రిపుల్ 'ఆర్' ఏపీఆర్ (ఆదాల ప్రభాకర్‌రెడ్డి), బీఎంఆర్ (బీద మస్తాన్‌రావు), ఆర్‌పీఆర్ (రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి) తడాఖా చూపిస్తామన్నారు. ఈ దఫా కావలి నియోజకవర్గంలోనే ఎక్కువ మెజార్టీ తీసుకుని వచ్చే బాధ్యతను మాతో పాటు మండల నాయకులు, కార్యకర్తలపై ఉందని తెలిపారు. త్వరలోనే టీడీపీ నుంచి భారీగా చేరికలు ఉండబోతున్నాయన్నారు. బుధవారం అల్లూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అల్లూరు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరిగింది.

కలిసి కట్టుగా కృషి చేద్దాం

ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న వేళ తోడేళ్లు అన్ని ఏకమవుతున్నాయని, ఈ తరుణంలో ప్రతి నాయకుడు, కార్యకర్త సమష్టిగా కృషి చేసి రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కాంక్షిస్తున్న 175 నియోజకవర్గాలకు 175 గెలిపించుకునే లక్ష్యంతో పని చేసి విజయం సాధిద్దామన్నారు. తనకు ఎంతో అండగా ఉన్న బీద మస్తాన్‌రావుతో కలిసి కావలి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు రాష్ట్ర భవిష్యత్తును, పేదల అభ్యున్నతిని దృష్టిలో పెట్టుకుని ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించాలని సూచించారు. ప్రతిపక్ష పార్టీలు, తోక పార్టీలు ఏకమై చేస్తున్న విషప్రచారాన్ని తిప్పి కొట్టాలని, ప్రజలకు వాస్తవాలు వివరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రభుత్వం అనేక మంచి కార్యక్రమాలతో ప్రజల్లో ఆదరణ పొందుతుంటే ప్రతిపక్ష నాయకులు అవినీతిలో కూరుకుపోయి జైలు పాలయ్యారని చెప్పారు. టీడీపీ ఉనికిని కాపాడుకునేందుకు అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగుతుందనే విషయాన్ని అర్థమయ్యేలా వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్కాఫ్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు, ఎంపీపీ శశిరేఖ, జెడ్పీటీసీ వేణమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు నీలం సాయికుమార్, అల్లూరు పట్టణ, రూరల్ అధ్యక్షులు దండా కృష్ణారెడ్డి, బీద రమేష్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం అమ్మకాల్లో నిబంధనలు పాటించాలి



మద్యం దుకాణాల సూపర్‌వైజర్స్‌తో సీఐ లక్ష్మణస్వామి, ఎస్‌ఐ

కావలి: కావలి, బోగోలు, జలదంకి మండలాల్లోని 13 ప్రభుత్వ మద్యం దుకాణాల్లో మద్యం అమ్మకాల్లో నిబంధనలు కచ్చితంగా పాటించాలని కావలి సెబ్ కావలి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ టి.లక్ష్మణస్వామి చెప్పారు. పట్టణంలోని సీఐ కార్యాలయంలో ప్రభుత్వ మద్యం దుకాణాల సూపర్ వైజర్స్‌తో బుధవారం సమావేశం జరిగింది. మద్యం అమ్మకాలు, ప్రభుత్వ నిబంధనలు, అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్‌ఐలు సత్యనారాయణ, రాజేశ్వరి పాల్గొన్నారు.

92 మద్యం బాటిల్స్ స్వాధీనం

కావలి పట్టణ పరిధి ముసునూరులో 48, మండలంలోని ఆనెమడుగులో 44 మద్యం బాటిల్స్ అక్రమంగా నిల్వ ఉన్నట్లు సమాచారం అందడంతో వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ లక్ష్మణస్వామి చెప్పారు. ఎస్‌ఐ రాజేశ్వరి తన సిబ్బందితో కలిసి చేసిన తనిఖీల్లో ఈ అక్రమ మద్యం బాటిల్స్ నిల్వలు గుర్తించి, బాధ్యులైన ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

అవినీతికి కేరాఫ్ ఎస్సై ఖాజావలి

- ప్రతి కేసుకు లంచం వసూలు
- కేసుల రాజీ పేరుతో రెండు వైపులా గుంజుడు

ఉదయగిరి: ఏసీబీకి చిక్కిన కొండాపురం ఎస్సై ఉద్యోగంలో చేరి తక్కువ కాలమే అయినా.. అనతి కాలంలోనే రూ.కోట్లు కూడబెట్టారనే ఆరోపణలు ఉన్నాయి. కొండాపురంలో విధుల్లో చేరి ఏడాదిన్నర కాలంలోనే రూ.2 కోట్లు పైగా వెనకేసుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. తన అవినీతికి అడ్డాగా మార్చుకున్న పెట్రోల్ బంకు నుంచే ప్రాథమిక విచారణలోనే సుమారు రూ.5 లక్షల పైగా ఎస్సై ఖాతాకు చేరినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఏసీబీకి పట్టుబడిన నేపథ్యంలో స్థానికంగా ఆయన అవినీతిపై ఆరోపణలు వెల్లువెత్తడంతో పూర్తిస్థాయిలో దర్యాప్తు ప్రారంభించారు. ఇసుక, మట్టి, మద్యం, కోడి పందేలు, పేకాట, తగాదాలు, కుటుంబ వివాదాలు.. కాదేది తన అవినీతికి అర్హం అన్నట్లుగా దోచుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి అవకాశాన్ని తనకు అనుకూలంగా మార్చుకుని పెద్ద మొత్తంలో వసూలు పాల్పడేవారు. ఈ విషయం పలువురు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పెద్దల అండ ఉండడంతో ఆయన జోలికి వెళ్లలేదు. మండలంలో కొన్ని ఎంపిక చేసిన ప్రదేశాల్లో పేకాట, కోడి పందేలు జోరుగా సాగుతున్నాయి. ఈ స్థావరాల్లో స్థానికులే కాకుండా పక్క మండలాలు నుంచి వచ్చి ఆడుతున్నారు. ఇందుకు ప్రతి ఫలంగా నిర్వాహకులు మామూళ్లు ముట్టచెబుతున్నట్లు సమాచారం. అంతకంటే ఇసుక రవాణా వాహనాల నుంచి నెల నెలా పెద్ద మొత్తంలో వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఉప్పువాగు, పిల్లాపేరు, మన్నేరు నుంచి ఇసుక నిత్యం వందల ట్రిప్పులు రవాణా సాగుతోంది. వాగుల నుంచి ఇసుక రవాణా ఉచితమే అయినా.. దీన్ని అడ్డం పెట్టుకుని భారీగా వసూలు చేశారనే వాహనదారులు వాపోతున్నారు. అనేక గ్రామాల్లో బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయిస్తున్నా.. నెల వారీ మామూళ్లు తీసుకుంటూ, ఉన్నతాధికారుల నుంచి సమాచారం వస్తే.. ముందుగానే సమాచారం చేర వేస్తూ వారిని కాపాడుతున్నట్లు ఫిర్యాదులు లేకపోలేదు. గ్రామాల్లో జరిగే వివిధ తిరునాళ్లు, ఉత్సవాలు సందర్భంగా అశ్లీల నృత్యాలకు అనుమతులు ఇచ్చేవారు. కొన్ని గ్రామాల్లో నిషేధ మాతమ్మ చిందులు నిర్వహించేందుకు అనుమతులు ఇచ్చి పెద్ద మొత్తంలో వసూలు చేసినట్లు ఆరోపణలు చేస్తున్నారు. గుట్కా ఉత్పత్తులు విక్రయిస్తున్న వారి నుంచి, డాబాల్లో మద్యం తాగడానికి నెలవారీ మామూళ్లు తీసుకుని చూసీచూడనట్లు ఉంటున్నారని సిబ్బందే బాహాటంగా చెబుతున్నారు. స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదులను రాజీ చేస్తూ రెండు వైపుల నుంచి లంచాలు తీసుకునేవారనే ఆరోపణలు ఉన్నాయి. ఎస్సై తీరు ఇలా ఉండటడంతో కొంతమంది కానిస్టేబుల్స్ తమ ఇష్టానురాజ్యంగా స్టేషను వచ్చే వారి నుంచి చిల్లర కొట్టుడుకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

సబ్ రిజిస్ట్రార్‌తో వాగ్వాదం



సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో వాదనకు దిగిన విక్రయదారులు

ఉదయగిరి: ఉదయగిరి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో బుధవారం వరికుంటపాడు మండలం కొండ్రాజుపల్లికి చెందిన నాగయ్య, రమేష్ తమ పొలం ఎందుకు రిజిస్ట్రేషన్ చేయరంటూ సబ్‌రిజిస్ట్రార్ విజయవాణితో వాగ్వాదానికి దిగారు. దీంతో కార్యాలయంలో కొంతసేపు ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. పరిస్థితి అదుపు తప్పుతుండడంతో సబ్‌రిజిస్ట్రార్ పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఉన్న డీఎస్పీ వెంకటరమణకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. బాధితుల సమాచారం మేరకు.. వరికుంటపాడు మండలం తోటలచెరువుపల్లి రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 193, 104, 195/1, 200/4లో 1.72 ఎకరాల భూమి పిత్రార్జితంగా పి.నాగయ్య పేరు మీద ఉంది. ఆ పొలాన్ని అదే గ్రామానికి చెందిన రమేష్ అనే వ్యక్తికి విక్రయించాడు. రిజిస్టర్ చేసేందుకు సోమవారం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి రాగా బుధవారం వస్తే చేస్తానని చెప్పారు. దీంతో బుధవారం కార్యాలయానికి వస్తే రెవెన్యూ రికార్డులు సక్రమంగా లేవంటూ రిజిస్ట్రేషన్ తిరస్కరించారు. దీంతో విక్రయదారులు సబ్‌రిజిస్ట్రార్ విజయవాణితో వాగ్వాదానికి దిగారు. ఈ విషయమై సబ్ రిజిస్ట్రార్‌ను వివరణ కోరగా ఈ సర్వే నంబర్లకు సంబంధించి 1974లో వారే వారి పేరు మీద రిజిస్టర్ చేసుకున్నట్లు ఉందని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రిజిస్ట్రేషన్ చేస్తానని చెప్పినా వాగ్వాదానికి దిగినట్లు చెప్పారు. రికార్డులు నిశితంగా పరిశీలించి అందులో అభ్యంతరంగా ఉన్న 30 సెంట్లు భూమి మినహాయించి మిగతా భూమికి రిజిస్ట్రేషన్ చేస్తున్నామని చెప్పారు.